సర్కారు వైఖరిపై నేడు నిరసనలు

- మండల కేంద్రాల్లో ఆందోళన
- బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపు

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): వానకాలం రైతు భరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ చర్యకు నిరసనగా ఆదివారం మండల కేంద్రాల్లో నిరసన చేపట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రేవంత్‌రెడ్డి సర్కార్ రైతు వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రైతుబంధును పూర్తిగా ఎత్తివేసే కుట్రలో భాగంగానే రైతు భరోసా పేరుతో క్యాబినెట్ సబ్ కమిటీ, కొత్త గైడ్‌లైన్స్ అంటూ డ్రామా చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి సర్కార్ రైతులకు చేస్తున్న అన్యాయాన్ని ఎట్టి పరిస్థితుల్లో బీఆర్ఎస్ సహించదని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి కుట్రలను రైతులకు తెలిసేలా బీఆర్ఎస్ కార్యకర్తలు నిరసన చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

రైతునోట్లో మట్టి..

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతు బంధుకు రాం రాం చెబుతుందని ఎన్నికలకు ముందే కేసీఆర్ చెప్పిన మాటలను రేవంత్‌రెడ్డి సర్కార్ అక్షరాల నిజం చేసిందని తెలిపారు. వానాకాలం రైతు భరోసాను ఎగ్గొట్టి రైతుల నోట్లో రేవంత్ రెడ్డి మట్టి కొట్టాడని మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కార్‌కు రైతుల ఉసురు తగులుతుందని శాపనార్థాలు పెట్టారు. కేసీఆర్ రూ.10వేల ముష్టి వేస్తున్నాడు.. మేము రూ.25 వేలు ఇస్తామన్న సిఫాయి ఇప్పుడు ఎక్కడ అని నిలదీశారు. రేవంత్‌రెడ్డి రైతుల వద్దకు వెళ్తే వీపు చింతపండు అవటం ఖాయమని అన్నారు. వానాకాలం రైతు భరోసా ఎట్టిపరిస్థితుల్లోనూ ఇవ్వాల్సిందేనని.. లేదంటే కాంగ్రెస్ నాయకులను ఎక్కడికక్కడ ముట్టడిస్తామని హెచ్చరించారు.

రేవంత్..రైతులకు క్షమాపణ చెప్పు

- మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : వానకాలం సీజన్‌కు రైతు భరోసా ఇవ్వలేమని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చావుకబురు చల్లగా చెప్పారని హరీశ్ మండిపడ్డారు. సిద్దిపేట ప్రెస్‌మీట్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట తప్పినందుకు సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే ముక్కు నేలకు రాసి రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రూ.లక్షా 50 వేల కోట్లు మూసీ సుందరీకరణకు ఉంటాయి గాని, రైతులకు రూ.15 వేల చొప్పున రైతుభరోసా ఇవ్వలేవా? అని ప్రశ్నించారు. 'రుణమాఫీ, బోనస్ విషయంలో రైతులను మోసం చేసినవ్.. ఇప్పుడు రైతు భరోసా విషయంలో మోసం చేసినవ్' అని నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ మంత్రులను, ఎమ్మెల్యేలను ఎక్కడికక్కడ నిలదీయాలని రైతులకు పిలుపునిచ్చారు.

సర్కార్‌కు గుణపాఠం తప్పదు

దేవరుప్పుల, అక్టోబర్ 19: కాంగ్రెస్ గెలిస్తే 'రైతుబంధు'కు రాంరాం చెబుతారన్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్న మాటలు నేడు అక్షర సత్యమైనట్టు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం ఆయన జనగామ జిల్లా దేవరుప్పులో మీడియాతో మాట్లాడారు. వానాకాలంలో రైతుబంధుకు ప్రభుత్వం ఎగనామం పెట్టడమంటే తెలంగాణ రైతాంగాన్ని మోసం చేయడమేనని స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అమలుకాని హామీ లిచ్చి ప్రజలతో ఓట్లేయించుకున్న రేవంత్‌రెడ్డి హామీలను అటకెక్కించడంతో నేడు ప్రజలకు ఆయన మాటల్లోని పరమార్థం బోధపడిందని అన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, వేదికపై పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, ఎమ్మెల్సీ తాతా మధు, రాష్ట్ర నాయకుడు రాకేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వనమా , హరిప్రియ, మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు

రైతుభరోసాపై చేతులెత్తేసిన సర్కార్

- మాజీ మంత్రి అజయ్‌కుమార్ ఫైర్

ఖమ్మం, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రైతుభరోసా పథకం అమలు చేయలేంటూ సర్కార్ చేతులెత్తేసిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విమర్శించారు. భద్రాద్రి జిల్లా కేంద్రంలోని కొత్తగూడెంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అధ్యక్షతన శనివారం ఏర్పాటుచేసిన పార్టీ జిల్లా కార్యకర్తల సమావేశంలో పువ్వాడ మాట్లాడారు. భద్రాద్రి జిల్లాలో గత సీఎం కేసీఆర్ నిర్మించిన సీతారామ ప్రాజెక్టును ఇప్పటి సీఎం రేవంత్ ప్రారంభించి నీళ్లు చల్లుకున్నారు గానీ రైతులకు మాత్రం సాగునీరు ఇవ్వలేక పోయారని దుయ్యబట్టారు. సమావేశంలో ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, హరిప్రియ, తాటి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాకేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సర్కారుపై రైతుల యుద్ధమే

- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ధ్వజం

సూర్యాపేట, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ) : రైతు భరోసా ఎకరాకు రూ.7,500 చొప్పున ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని మ్యానిఫెస్టోలో పెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేడు మాటమార్చుతున్నదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. రైతులు కాంగ్రెస్ నేతల గల్లా పట్టి బాకీ వసూలు చేసుకునే రోజులు అతి సమీపంలోనే ఉన్నాయని, రైతుల తిరుగుబాటుకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. వానాకాలానికి రైతు భరోసా ఇవ్వడం లేదని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేసిన వ్యాఖ్యలపై జగదీశ్‌రెడ్డి ఫైర్ అయ్యారు. మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మూసీపై మురికి మాటలు మాట్లాడంపై ధ్వజమెత్తారు. కోమటిరెడ్డి చేసిన చిల్లర పనులకు ఆ కుటుంబమే ఉరి వేసి చంపుతుందన్నారు. శనివారం జగదీశ్‌రెడ్డి సూర్యాపేటలో మీడియాతో మాట్లాడారు. వానాకాలానికి రైతు భరోసా లేదన్న తుమ్మల వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు.

రైతులు గొంతుకోశారు:కొప్పుల ఈశ్వర్

రెండు పంటలకు రైతుభరోసా ఎగ్గొట్టి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల గొంతు కోశారు. వ్యవసాయశాఖ మంత్రే ఈ వానకాలం పంటకు రైతుభరోసా ఇవ్వమని చెప్పడం సిగ్గుచేటు. కాంగ్రెస్ వస్తే రైతుబంధుకు రాంరాం చెబుతుందని కేసీఆర్ అనాడే చెప్పారు. ఎకరాకు 15 వేల చొప్పున రైతుభరోసా కోసం కండ్లు కాయలు కాచేలా రైతులు ఎదురుచూశారు. పంట కోసి ధాన్యం అమ్మకానికి తీసుకెళ్తున్న సమయంలో మంత్రి చావుకబురు చల్లగా చెప్పారు. ఈ రోజు కాంగ్రెస్ సర్కారు నిజస్వరూపం బయటపడింది.

కాంగ్రెసోళ్లను నిలదీయాలి:పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట రూరల్, అక్టోబర్ 19: రైతుభరోసా పథకం విషయంలో తెలంగాణ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. శనివారం ఆయన వరంగల్ జిల్లా నర్సంపేటలో మీడియాతో మాట్లాడారు. ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను ప్రతి ఒక్కరూ నిలదీయాలని పిలుపునిచ్చారు. 'రైతుభరోసా'లో ఎకరాకు రెండు పంటలకు రూ.15 వేలు ఇస్తామని హామీ ఇవ్వడమేగాక దసరా పండుగ వరకైనా ఇస్తామని చెప్పి అమలు చేయలేదని విమర్శించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ వానకాలం సీజన్ పంటలకు రైతుభరోసా ఇవ్వలేమని చెప్పడం రైతాంగాన్ని మోసం చేయడమేనని ఆయన గుర్తుచేశారు.

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అల వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నేత లు దూదిమెట్ల బాలరాజుయాదవ్, పల్లె రవికుమార్, రాజారాంయాదవ్

రేవంత్‌రెడ్డికి ధనదాహం

- హామీల అమలుకు డబ్బుల్లేవుగానీ మూసీకి లక్షన్నర కోట్లు ఎక్కడివి?
- రూ.1.25 లక్షల కోట్లు దోపిడీ కుట్ర
- రైతు భరోసా లేదని రేవంత్ మాటగా తుమ్మల చెప్పారు
- అన్ని పంటలకు బోనస్ ఇవ్వాల్సిందే
- గ్రూప్-1 అభ్యర్థుల ఆందోళనకు బండి మద్దతు రేవంత్‌రెడ్డి కుట్రలో భాగమే
- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఫైర్

హరీశ్‌రావు మంత్రిగా ఉన్నప్పుడు ఆయన వెనకాల ఉన్న రేవంత్ ఫొటోను చూపుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు డబ్బులు లేవుకానీ, మూసీ సుందరీకరణకు లక్షన్నర కోట్లు ఎక్కడివని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి నిలదీశారు. రూ.25 వేల కోట్లతో పూర్తయ్యే మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు లక్షన్నర కోట్లు అని చెప్పి, రూ.1.25 లక్షల కోట్లు దోచుకోవాలని రేవంత్‌రెడ్డి చూస్తున్నారని ఆరోపించారు. సీఎంగా ఎంతకాలం ఉంటాడో తెలియనందున దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకోవాలని రేవంత్‌రెడ్డి ధనదాహం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. మూసీ పేరుతో దోపిడీ కుట్రను అడ్డుకుంటున్న బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావును బుల్డోజర్లతో తొక్కించి చంపుతామన్నట్టుగా రేవంత్ బరితెగించి మాట్లాడుతున్నారని ఫైరయ్యారు. వానకాలం పంటకు రైతుభరోసా ఇవ్వలేమని రేవంత్ మాటగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించి రైతుల నోట్లో మట్టికొట్టారని మండిపడ్డారు. మరోవైపు అన్ని పంటలకు బోనస్ ఇస్తామన్న హామీ సైతం అటకెక్కించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేపట్టకపోవడంతో రైతులు దళారులకు విక్రయించి తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణభవన్‌లో శనివారం మాజీ ఎమ్మెల్యే అల వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నేత లు దూదిమెట్ల బాలరాజుయాదవ్, పల్లె రవికుమార్, రాజారాంయాదవ్‌తో కలిసి ప్రశాంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తాను సీఎం అవుతానని రేవంతే అనుకోలేదని, అందుకే ఎన్నికల్లో అడ్డగోలుగా హామీలు ఇచ్చారని, వాటిని నమ్మి కాంగ్రెస్‌కు ఓట్లు వేసి గెలిపించారని చెప్పారు. ఇక కాంగ్రెస్ జన్మలో రాష్ట్రంలో బతికి బట్టగట్టే పరిస్థితి లేదని చెప్పారు. పదవి కాపాడుకోవడానికి దోపిడీ చేస్తూ ఢిల్లీకి డబ్బులు పంపుతున్నారని విమర్శించారు. రూ.25 వేల కోట్లతో పూర్తయ్యే మూసీ పునరుజ్జీవం కోసం రేవంత్ లక్షన్నర కోట్లు వెచ్చిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇవన్నీ అడిగితే కేటీఆర్, హరీశ్‌రావులపై రాజీవ్ సద్భావన సభలో రేవంత్‌రెడ్డి సంస్కారహీనంగా మాట్లాడారని మండిపడ్డారు. నాడు రాజీవ్‌గాంధీ భాయి.. భాయి అంటే నేడు రేవంత్ భౌ భౌ అని అరుస్తున్నారని ఎద్దేవా చేశారు. మూసీ పనులకు అడ్డుపడితే కాంగ్రెస్ నేతలతో బుల్డోజర్లు నడిపించి కేటీఆర్, హరీశ్‌రావులను చంపుతా అని రేవంత్ అంటున్నారని, ఇది సీఎం పదవిలో ఉన్న వ్యక్తి మాట్లాడే భాషేనా? అని నిలదీశారు. తక్షణమే సీఎం రేవంత్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్

నమ్మి అధికారం అప్పగిస్తే రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నట్టేట ముంచిందని ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతు భరోసా ఎగ్గొట్టి సంక్రాంతి పండుగ వరకైనా ఇస్తామని చెప్పి అమలు చేయలేదని, ఇప్పుడు ఎన్నికల కోడ్ ఉన్నదని సాకులు చెప్తున్నదని మండిపడ్డారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర వ్యాప్తంగా అన్నదాతలు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేసి తీవ్ర నిరసన వ్యక్తంచేశారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని బస్టాండ్ సమీపంలో.. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఎం సైదా దిష్టిబొమ్మను లాక్కెళ్లే ప్రయత్నం చేయగా.. బీఆర్ఎస్ శ్రేణులు ఆయనను అడ్డుకొని దిష్టిబొమ్మను దహనం చేశాయి. నల్లగొండ జిల్లా కట్టంగూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజలపై ఏ మాత్రం గౌరవం ఉన్నా ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తి, గద్వాల, భూత్పూరు, మూసాపేటలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్, బాల్కొండ, ఏర్గట్ల, కమ్మర్‌పల్లి, వేల్పూర్, భీమ్‌గల్, ఆర్మూర్ మండలాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు సీఎం రేవంత్, మంత్రి తుమ్మల దిష్టిబొమ్మలను దహనం చేశారు. సూర్యాపేటలోని జనగాం క్రాస్ రోడ్డులో జాతీయ రహదారిపై సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

వెనుక చేతులు కట్టుకొని నిలబడ్డదెవరో చూడు!

హరీశ్‌రావు తన ఇంటికి వచ్చి చేతులు కట్టుకుని నిలబడ్డారని రేవంత్‌రెడ్డి పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని ప్రశాంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. హరీశ్‌రావు పదేండ్లు మంత్రిగా ఉన్నపుడు రేవంత్ ఎక్కడ ఉన్నారు? అని ప్రశ్నించారు. హరీశ్‌రావు వెనకాల ఓ కార్యకర్తగా ఉన్నారని చెప్పారు. ఇందుకు సంబంధించిన ఫొటోను ఈ సందర్భంగా మీడియాకు చూపించారు. హరీశ్‌రావు ఎవరి చెప్పులో మోశారు అంటున్న రేవంత్.. యనమల చెప్పులు తాకుతున్న ఫొటోను లోకమంతా చూసిందని చెప్పారు. ఇందుకు సంబంధించిన ఫొటోను కూడా ప్రశాంత్‌రెడ్డి మీడియాకు చూపించారు. తన కన్నా హరీశ్‌రావు ఎంతో సీనియర్ అని రేవంత్ గ్రహించాలని హితవుపలికారు. 'ఈ అసహనం మాటలు ఎందుకు? పాలించడం చేతకాకపోతే రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పి సీఎం పదవి నుంచి తప్పుకోవాలి' అని డిమాండ్ చేశారు.

బండి సంజయ్.. రేవంత్ కుమ్మక్కు

కేంద్రమంత్రి బండి సంజయ్, సీఎం రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యారని ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. సీఎంని బండి కాపాడే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. రేవంత్ పదవి పోతుందని సంజయ్ తెగ బాధపడిపోతున్నారని ఎద్దేవా చేశారు. మంత్రులే రేవంత్‌ను దించుతారని, జాగ్రత్తగా ఉండాలని సంజయ్ సలహా ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. గ్రూప్-1 అభ్యర్థుల విషయంలో బీఆర్ఎస్‌కు క్రెడిట్ దక్కుతుందని బండి సంజయ్ పెద్ద డ్రామాకు తెరలేపారని విమర్శించారు. ఆందోళనకు సంజయ్ మద్దతు ఇవ్వడం రేవంత్ కుట్రలో భాగమేనని పేర్కొన్నారు. ఎన్నికల హామీల అమలుపై ఎందుకు సీఎంను నిలదీయడం లేదని ప్రశ్నించారు.

మంత్రుల ఫామ్‌హౌస్‌లపై చర్య తీసుకో..

నాయకుల ఫామ్‌హౌస్‌లు మూసీ బఫర్ జోన్‌లో ఉన్నాయా? లేవా? అని తేల్చాడానికి సీఎం పదవిలో ఉంటూ నిజనిర్ధారణ కమిటీ వేస్తా అంటున్నారని ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. నిజనిర్ధారణ కమిటీలు పౌర సమాజం వేస్తుందని, సీఎం కాదని తెలిపారు. చట్టప్రకారం ఫామ్‌హౌస్‌లపై చర్యలు తీసుకుంటే ఎవరు వద్దన్నారని ప్రశ్నించారు. ముందు చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న మంత్రులు, కాంగ్రెస్ నాయకుల ఫామ్‌హౌస్‌లపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'మీ సోదరుడి ఇంటి కూల్చివేతకు నోటీసులిస్తవ్.. పేద ల ఇండ్ల మీదికి మాత్రం నేరుగా బుల్డోజర్లను పంపుతవ్. ఇదేం నీతి రేవంత్‌రెడ్డి?' అని ప్రశ్నించారు. బెదిరిస్తే భయపడేవారు ఇక్కడ ఎవరూ లేరని, రూ.1.25 లక్షల కోట్లు దోచుకుంటామంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. రైతు రుణమాఫీ అయ్యేదాకా, రైతు భరోసా ఇచ్చేదాకా వదలిపెట్టబోదని తేల్చి చెప్పారు.

రైతుబంధుకు రాంరాం

మొదటిపేజీ తరువాయి...

బీఆర్కే భవన్‌లో మంత్రి తుమ్మల మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వానకాలం పెట్టుబడి సాయం ఇవ్వనట్లేనా ? అని విలేకరులు ప్రశ్నించగా... 'రబీ నుంచి అని చెప్పానుగా.. సబ్ కమిటీ రిపోర్ట్ రాగానే వచ్చే పంట కాలానికి అంటే రబీ(యాసంగి)కి ఇస్తాం' అని తెలిపారు. వెంటనే మరి ఈసారి అని విలేకరి ప్రశ్నించగా.. 'ఇది లేదు' అని మంత్రి తుమ్మల స్పష్టతనిచ్చారు. డిప్యూటీ సీఎం నేతృత్వంలోని కమిటీ రిపోర్ట్‌రాగానే, డిసెంబర్‌లో రుణమాఫీ పూర్తి కాగానే రైతుభరోసా ఇస్తామని తెలిపారు. తమ పార్టీ హామీ ఇచ్చినట్టుగా ఎకరానికి రూ. 7500 చొప్పున.. పంట వేసిన రైతులకు మాత్రమే ఇస్తామని స్పష్టం చేశారు.

2 లక్షలపై రుణమాఫీ డిసెంబర్ తర్వాతే...

రాష్ట్రానికి ఆర్థికంగా వెసులుబాటు లేకపోయినా రుణమాఫీ భారాన్ని భుజాన వేసుకున్నామని మంత్రి తుమ్మల తెలిపారు. తాము ఇచ్చిన హామీ ప్రకారం 2022 నవంబర్ నుంచి మాత్రమే రుణాలను మాఫీ చేయాలని, కానీ రైతులకు అన్యాయం జరగొద్దని ఐదేండ్లు తీసుకున్నట్టు తెలిపారు. తమ లెక్క ప్రకారం రుణమాఫీ అర్హులు 42 లక్షల ఖాతాలు ఉండగా 25 లక్షల మంది కుటుంబాలని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15 వరకు 2 లక్షల లోపు రుణాలను మాఫీ చేసి రూ.18 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేసినట్టు తెలిపారు. రుణమాఫీ వివరాలతో నియోజకవర్గాల వారిగా బుక్ తయారీ చేసినట్టు తెలిపారు. ఇంకా 20 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయాల్సి ఉందని ఆయనే స్వయంగా ఒప్పుకొన్నారు. రూ. 2 లక్షలలోపు రుణమాఫీ కాని తెల్లకార్డులేని రైతుల కుటుంబ నిర్ధారణ చేయగా 3లక్షల కుటుంబాల లెక్క తేలిందని చెప్పారు. వీరికి డిసెంబర్ లోపు రుణమాఫీ చేస్తామని చెప్పారు. 2 లక్షలకుపైగా రుణ రైతులకు ఆ తర్వాత క్యాబినెట్‌లోచర్చించి షెడ్యూల్ ప్రకటిస్తామని తెలిపారు. నెలల వారీగా, వాయిదాల వారీగా రుణమాఫీ చేస్తామని చెప్పారు. రైతులు 2 లక్షలకు పైగా రుణం చెల్లించిన వెంటనే వారి ఖాతాల్లో రూ. 2 లక్షలు జమ చేస్తామని తెలిపారు. రుణమాఫీ పూర్తి కావడానికి ఎంత సమయం పడుతుందని విలేకరులు ప్రశ్నించగా... మంత్రి నుంచి స్పష్టమైన సమాధానం కరువైంది.



వనపర్తి అంబేద్కర్ చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రైతన్న కన్నెర

- రైతు భరోసా ఎగవేతకు కుట్ర అంటూ ఫైర్
- రాష్ట్ర వ్యాప్తంగా సీఎం దిష్టిబొమ్మల దహనం
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అన్నదాతల ఆందోళన

మెదక్ జిల్లా నర్సాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

నల్లగొండ జిల్లా కట్టంగూర్ తహసీల్ కార్యాలయం వద్ద రైతు ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు

సీజన్ పూర్తయ్యాక ఎగనామం

- రైతులను నమ్మించి నట్టేట ముంచిన వైనం
- నివేదిక పేరుతో జాప్యం
- యాసంగిలోనూ కోతలు తప్పవని మంత్రి తుమ్మల స్పష్టీకరణ
- 'భరోసా' కరువై.. దిక్కుతోచని స్థితిలో రైతన్నలు

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): అనుకున్నంత పని అయింది.. రైతుల ఆందోళన నిజమైంది. అంతా ఊహించినట్టుగానే వానకాలం రైతుభరోసాకు కాంగ్రెస్ సర్కారు ఎగనామం పెట్టింది. పెట్టుబడి సాయంపై చేతులెత్తేసి రైతులకు 'మొండి చేయి' చూపింది. పెట్టుబడి సాయం కోసం కండ్లుకాయలు కాసేలా ఎదురుచూసిన రైతుల నెత్తిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు పిడుగు వేశారు. వానకాలం పంట సీజన్ పూర్తయ్యాక చావు కబురు చల్లగా చెప్పేశారు. ఈ సీజన్‌కు రైతుభరోసా ఇవ్వడం లేదని సాక్షాత్తు ఆయనే వెల్లడించారు. యాసంగి రైతుభరోసాపైనా నమ్మకం పెట్టుకోవద్దని పరోక్షంగా సంకేతాలిచ్చారు. యాసంగిలో రైతులందరికీ రైతుబంధు రాదని, పంట వేసిన రైతులకు, పంట వేసిన భూమికి మాత్రమే రైతుభరోసా ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. రైతుభరోసాను ఎగవేసేందుకు పక్కా ప్లాన్‌తోనే ప్రభుత్వం మంత్రుల కమిటీ, సమావేశాలు, అభిప్రాయ సేకరణలు, అసెంబ్లీ చర్చ అని మభ్యపెట్టిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పదివేలకూ ఎగనామం

కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు ద్వారా ప్రతి రైతుకు ఏడాదికి ఎకరానికి రూ. 10వేల చొప్పున పెట్టుబడి సాయం అందించింది. ఎన్నికల సమయంలో అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి 'ఈ 10వేలు ఎందుకు, నాలుగు రోజులు ఆగితే కాంగ్రెస్ ప్రభుత్వం వస్తది. అప్పుడు రైతుభరోసా కింద అదనంగా రూ. 5వేలు కలిపి ఎకరాకు రూ. 15వేలు ఇస్తం' అంటూ గప్పాలు కొట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మొన్నటి యాసంగి, ఈ వానకాలం సీజన్లు పూర్తయ్యాయి. ఇందులో యాసంగిలో రైతుబంధు కింద పాత 10వేలే పంపిణీ చేసింది. ఈ సీజన్‌కైనా రూ. 15వేలు ఇస్తారేమో అని రైతులు ఆశపడ్డారు. కానీ పాత 10వేలకే ఎసరు పెట్టడం గమనార్హం.

కమిటీలతో కాలయాపన

రైతుభరోసాను అమలు తప్పించుకునేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళిక వేసింది. రైతుబంధులో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసాలో మార్పుల కోసం మంత్రులతో సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. జూలై 2వ తేదీన ఏర్పాటు చేసిన ఈ కమిటీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఉన్నారు. ఈ కమిటీ రైతుల అభిప్రాయాలు సేకరించి 15 రోజుల్లో నివేదిక అందిస్తుందని, ఆ నివేదిక ఆధారంగా అసెంబ్లీలో రైతుభరోసాపై చర్చ పెడతామని ప్రకటించారు. ఉమ్మడి జిల్లాల వారీగా తొమ్మిది సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించి, నాలుగు సమావేశాలకే మమ అనిపించేసింది.

అసెంబ్లీలో చర్చే లేదు

రైతుభరోసాపై మంత్రుల కమిటీ 15 రోజుల్లో ఇస్తారన్న నివేదిక అతీ గతీ లేకుండా పోయింది. నాలుగు నెలలు గడుస్తున్నా నివేదికపై ప్రభుత్వం ఊసెత్తడం లేదు. తాజాగా మంత్రి తుమ్మల కమిటీ నివేదిక ఎందుకు ఇవ్వలేదో సమాధానం చెప్పకుండా.. కమిటీ నివేదిక రాగానే యాసంగి రైతుభరోసా ఇస్తామని ప్రకటించారు. యాసంగి సీజన్ ముగిసే వరకైనా నివేదిక వస్తుందా లేక వానకాలం మాదిరిగానే ఎగనామం పెడతారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇక అసెంబ్లీలో చర్చ పెడతామని చెప్పిన ప్రభుత్వం.. సమావేశాలు జరుగుతున్నప్పుడు ఆ ఊసే ఎత్తకపోవడం గమనార్హం.

యాసంగిలో కోతలకు సిద్ధం

యాసంగిలో పంట వేసిన రైతులకు, పంట వేసిన భూమికి మాత్రమే రైతుభరోసా ఇవ్వాలని నిర్ణయించినట్టుగా మంత్రి తుమ్మల కుండబద్దలు కొట్టారు. రుణమాఫీ మాదిరిగానే రైతుభరోసాకూ పీఎం కిసాన్ నిబంధనల అమలుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. ఇందులో భాగంగానే 5 ఎకరాలు లేదా 10 ఎకరాలకు సీలింగ్ పెట్టాలని భావిస్తున్నది.

కేసీఆర్ ప